సాక్షి
అనంతపురం
శుక్రవారం । 29 । నవంబర్ । 2024



టన్ను చీనీ రూ.29,190

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.29,190, కనిష్టంగా రూ.13 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాటా రూ.33

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.33, కనిష్టంగా రూ.20, సరాసరిన రూ.26 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
32.1°/11.3°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు




అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీపీజీసెట్-2024లో ఉత్తీర్ణులు కాకపోయినా, పరీక్ష రాయకపోయినా కేవలం డిగ్రీ ఉత్తీర్ణత ద్వారా ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ ఎకనామిక్స్, ఎమ్మెస్సీ బాటనీ, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎమ్మెస్సీ జువాలజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చని తెలియజేశారు. స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశాలు పొందే విద్యార్థులు మొత్తం కోర్సు ఫీజు, అడ్మిషన్ ఫీజు చెల్లించాల్సి ఉటుందని, వీరికి ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్ రాదని స్పష్టం చేశారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో ఆయా డిపార్ట్‌మెంట్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

48 మంది ఎంపీఈఓలకు పోస్టింగ్

అనంతపురం అగ్రికల్చర్: డిప్యుటేషన్లు రద్దు కావడంతో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరిధిలో మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ (ఎంపీఈవో)గా పనిచేస్తూ జిల్లాకు వచ్చిన 48 మందికి పోస్టింగ్ ఇచ్చినట్లు వ్యవసాయశాఖ అధికారులు గురువారం తెలిపారు. పంటల విస్తీర్ణం అధికంగా ఉన్న ప్రాంతాలు, ఆర్‌ఎస్‌కేలు అందుబాటులో లేని కొన్ని ప్రాంతాల్లో పనిచేసేలా ఉత్తర్వులు ఇచ్చామన్నారు. ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ల రేషనలైజేషన్ మొదలయ్యాక పూర్తి స్థాయిలో బదిలీలు ఉంటాయని తెలిపారు.

8న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష



అనంతపురం ఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష డిసెంబరు 8న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హాల్‌టికెట్లు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు స్కూల్ యూడైస్ కోడ్ ద్వారా లాగిన్ అయి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులకు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ పరీక్షల విభాగం, డీఈఓ కార్యాలయం (పాతది), కమలానగర్‌లో సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు నిబంధనల ఉల్లంఘనులపై కొరడా

అనంతపురం సెంట్రల్: రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘించే వారిపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం కూడా జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేపట్టారు. 24 గంటల వ్యవధిలో 2,546 కేసులు నమోదు చేసి రూ. 5.31 లక్షల జరిమానా విధించారు. అలాగే 93 బహిరంగ మద్యపానం కేసులు, 14 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఏటీఎంల భద్రతలో భాగంగా 165 కేంద్రాలను తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాదాలు, నేరాలపై డయల్ 100 లేదా 112కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

గంజాయి విక్రయిస్తే పీడీ యాక్ట్



సిబ్బందితో సమీక్షిస్తున్న ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య

అనంతపురం సెంట్రల్: జిల్లాలో గంజాయి విక్రయిస్తున్న వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బందిని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. గురువారం అనంతపురంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. గంజాయి సరఫరా, విక్రయాలపై నిఘా మరింత పెంచాలన్నారు. జిల్లాలో ఎక్కడా కర్ణాటక మద్యం సరఫరా కాకూడదన్నారు. మద్యం షాపులు, బార్లలో తరచూ తనిఖీలు చేపట్టాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐలు జయ నరసింహ, జాకీర్, కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

- కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ఓ యువకుడు డిగ్రీ చదివేందుకు అనంతపురం వచ్చాడు. బీరు తాగితే ఏమీ కాదంటూ ఇక్కడి స్నేహితులు అతనికి అలవాటు చేశారు. దీంతో నిత్యం రెండు మూడు బీర్లు తాగేవాడు. కొన్నిరోజులకే ఊబకాయుడిగా తయారయ్యాడు.
- నగరంలోని అరవిందనగర్‌కు చెందిన ఓ యువకుడు బీర్లు తాగడం అలవాటు చేసుకున్నాడు. నిత్యం బీర్లు తాగనిదే నిద్రపోని అతను.. నెలరోజుల్లోనే విపరీతంగా బరువు పెరిగాడు. ఈ క్రమంలోనే సహచరులు అవహేళన చేయడం ప్రారంభించడంతో బరువు తగ్గడానికి కొన్ని రోజులుగా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాడు.



బీర్ బలులు

- విచ్చలవిడిగా బీర్ల వినియోగం
- 45 రోజుల్లో ఉమ్మడి అనంతపురంలో 12 లక్షల బీర్ల అమ్మకం
- మితిమీరిన కార్బోహైడ్రేడ్, కేలరీస్ కారణంగా పెరుగుతున్న పొట్టలు
- ఒక్క బీరు తాగితే సగటున 208 కేలరీలు శరీరంలోకి
- చికెన్, మటన్‌లు తినడంతో మరో 200 కేలరీలు అదనం
- 30 ఏళ్లకే ఊబకాయులుగా మారుతున్న యువకులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: కుర్రాళ్లకు బీర్లు తాగడం ఇటీవల ఫ్యాషన్‌గా మారింది. ఫ్రెండ్స్‌తో పార్టీల పేరుతో మితిమీరి బీర్లు సేవిస్తున్నట్లు తేలింది. ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న వారు కూడా పార్టీల పేరున విచ్చలవిడిగా బీర్లు తాగుతున్నారు. మరీ ముఖ్యంగా స్ట్రాంగ్ బీర్లపైన యువకులు ఎక్కువ మక్కువ చూపుతున్నట్లు తెలిసింది. గడిచిన 45 రోజుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రమారమి 12 లక్షల పైచిలుకు బీర్లు అమ్ముడయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. బీరు ఏమీ కాదు, ఆల్కహాల్ తక్కువగా ఉంటుంది అంటూ సీనియర్లు ముగ్గులోకి దించి ఆ తర్వాత నెమ్మదిగా విస్కీ, బ్రాందీలకు అలవాటు పడేలా చేస్తున్నారు.

ఊబకాయం ఉచితం..

బీర్లు ఎక్కువగా తాగడం వల్ల చిన్న వయసులోనే ఊబకాయులుగా మారుతున్నట్టు వైద్యుల పరిశీలనలో వెల్లడైంది. ఎక్కువ మోతాదులో కార్బోహైడ్రేడ్, కేలరీలు శరీరంలో చేరడం, దీనికి తగ్గట్టు వ్యాయామం లేకపోవడం కారణంగా పొట్ట సైజు భారీగా పెరుగుతోంది. దీనికి తోడు బీరు సేవిస్తున్న సమయంలో చికెన్, మటన్, నిల్వ ఉన్న చిప్స్, ఎక్కువ నూనెలో చేసిన వేపుళ్లు వంటివి తినడం వల్ల అదనంగా మరో 250 కేలరీలు పొట్టలోకి చేరుతున్నాయి. సాధారణంగా రోజువారీగా తినే ఆహారంలో 2 వేల కేలరీల వరకూ ఉంటాయి. బీర్లు తాగడం, తాగే సమయంలో ఎక్కువ మోతాదులో నాన్‌వెజ్ తీసుకోవడం వల్ల అదనపు కేలరీలను కరిగించేందుకు వ్యాయామం చేయాలి. అది లేకపోవడం వల్లే పొట్టల సైజు భారీగా పెరుగుతోంది. ఊబకాయం బారిన పడటం వల్ల కొంతమంది యువకులకు పెళ్లిళ్లు సకాలంలో కావడం లేదు. బీర్లు ఎక్కువగా సేవిస్తూ వ్యాయామం చేయకపోతే నెల రోజుల్లోనే బరువు పెరిగే అవకాశం ఉన్నట్టు వైద్యులు హెచ్చరిస్తున్నారు.

గుండెకు ముప్పు



బీర్లు అనేవి చాలా హై కేలరీ డ్రింక్. దీనివల్ల వేగంగా శరీర బరువు పెరిగే అవకాశం ఉంటుంది. దీంతో పాటు శరీరంలో కొవ్వులు పెరిగే అవకాశం ఎక్కువ. ఆల్కహాల్ పర్సెంటేజీ తక్కువ ఉండొచ్చుగానీ, కార్బోహైడ్రేడ్ ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువ హాని చేస్తాయి. శరీర బరువు పెరగడం, కొలెస్ట్రాల్ పెరగడం అంటే గుండెకు ముప్పు వస్తున్నట్టే.

– డా.వంశీకృష్ణ, హృద్రోగ నిపుణులు, అనంతపురం

650 ఎంఎల్ బీరు తాగితే శరీరంలో చేరేవి..	
కార్బోహైడ్రేడ్	23.42
కేలరీలు	208-284
ప్రోటీన్లు	3.03
ఆల్కహాల్	5 శాతం

గడిచిన 45 రోజుల్లో ఉమ్మడి అనంత జిల్లాలో బీర్ల అమ్మకం ఇలా	
అనంతపురం జిల్లాలో బీర్ కేసుల అమ్మకం	62,531
బాటిళ్ల లెక్కన అయితే	7,50,372
శ్రీసత్యసాయి జిల్లాలో బీర్ కేసుల అమ్మకం	37,892
బాటిళ్ల లెక్కన	4,54,704
మొత్తం బాటిళ్ల వినియోగం	12,05,076
బీర్ల వినియోగానికి అయిన వ్యయం	రూ.24,10,15,200

రేపు నేమకల్లుకు సీఎం



గ్రామ సభ వేదికను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామంలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు జిందాల్ విజయనగర ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.45 గంటలకు నేమకల్లుకు సీఎం చేరుకుంటారు. 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. అనంతరం నేమకల్లు ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని, గ్రామ ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహిస్తారు. 3.45 గంటలకు హెలికాప్టర్‌లో నేమకల్లు నుంచి జిందాల్ విజయనగర్ ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలు దేరి వెళతారని అధికార వర్గాలు తెలిపాయి.

ఏర్పాట్ల పరిశీలన..

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ గురువారం నేమకల్లులో పర్యటించారు. హెలిప్యాడ్, సీఎం పంపిణీ చేయనున్న పెన్షన్ లబ్ధిదారుల గృహాలు, నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయం, గ్రామ సభ నిర్వహించే ప్రాంతాలను పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రజల రాకపోకలకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. సజావుగా గ్రామ సభ సాగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ రవిబాబు, జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సంపత్, సర్వే ఏడీ రూప్లనాయక్, అనంతపురం మున్సిపల్ కమిషనర్ నాగరాజు, డీపీఆర్‌ఓ గురుస్వామి శెట్టి, బొమ్మనహాళ్ తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ దాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడలు వంచుదాం

- ప్రజలు గగ్గోలు పెడుతున్నా పట్టదా?
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ''పంట నష్టపోయిన రైతులను ఆదుకోకుండా, మద్దతు ధర కల్పించకుండా రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం ఏడిపిస్తోంది. 'తల్లికి వందనం', 'అన్నదాత సుఖీభవ', 'నిరుద్యోగ భృతి', 'ఉచిత సిలిండర్లు', 'ఫ్రీ బస్సు' అంటూ ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన చంద్రబాబు ప్రభుత్వ మెడలు వంచేందుకు ప్రజలు సన్నద్ధమవ్వాలి'' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరికి ప్రజలకు మేలు చేయాలనే ఆలోచన లేదని విమర్శించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 63 మండలాల్లో 17 మండలాల్లోనే కరువు ఉన్నట్లు తప్పుడు నివేదికలు రూపొందించారని దుయ్యబట్టారు. అనంతపురం జిల్లాలోని ఏడు మండలాల్లో రూ.17.60 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లాలో రూ.25 కోట్లు మాత్రమే నష్టం వాటిల్లినట్లు లెక్కగట్టి అన్యాయం చేశారని వాపోయారు. హంద్రీనీవా సామర్థ్యాన్ని 6,200 క్యూసెక్కులకు పెంచితేనే రాయలసీమకు ప్రయోజనం చేకూరుతుందని, కానీ ఈ ప్రభుత్వం 3,500 క్యూసెక్కులకే పరిమితం చేయడం అన్యాయమన్నారు.

రైతులకు దగా..

పంటలకు మద్దతు ధర అని ప్రకటించినా.. ఇంత వరకు ఎక్కడా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని అనంత మండిపడ్డారు. వరి సాధారణ రకం క్వింటాల్ మద్దతు ధర రూ.2,300, ఏ గ్రేడ్ రకం రూ.2,320 అని ప్రకటించి మాటలకే పరిమితమయ్యారని, ప్రస్తుతం రూ.1,950 నుంచి రూ.2,050కు అమ్ముకునే పరిస్థితి ఉందన్నారు. మొక్కజొన్న మద్దతు ధర రూ.2,225 అని ప్రకటించారని, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మొక్కజొన్న క్వింటాల్ రూ.3 వేలు పలికిందని గుర్తు చేశారు. వేరుశనగ రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉందన్నారు. క్వింటాల్ ధర రూ.6,783గా ప్రకటించినా బస్తా కేవలం రూ.1,800కే అమ్ముకుంటున్నారన్నారు. అరటి పంట రైతులకు గతేడాది తొలి కొయ్య రూ.25 వేల నుంచి రూ.28 వేలు ఉంటే ఈ ఏడాది కేవలం రూ. 17 వేల నుంచి రూ.19 వేలు, రెండో కొయ్య గతంలో రూ.19 వేల నుంచి రూ.20వేలు ఉంటే.. ఈ ఏడాది రూ.12 వేల నుంచి రూ.13 వేలు మాత్రమే పలుకుతోందన్నారు.

అండగా నిలిచిన జగనన్న..

గత ప్రభుత్వంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పెట్టుబడి సాయంగా ఏటా రూ.13,500ను మూడు విడతల్లో రైతులకు అందజేశారన్నారు. ఏకంగా రూ.1,900 కోట్లు అందించి ఆదుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో 'అన్నదాత సుఖీభవ' కింద రూ.20,000 ఇస్తామని మాట తప్పారని మండిపడ్డారు.

ప్రగల్భాల మంత్రి నాదెండ్ల..

రాష్ట్ర వ్యాప్తంగా 37 లక్షల మెట్రిక్ టన్నులు సేకరిస్తామని సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రగల్భాలు పలికారని, క్షేత్రస్థాయిలో మాత్రం ఇప్పటి వరకు కేవలం 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారని ఆయన వివరించారు. ఆయిల్‌ఫెడ్ ద్వారా అరటిని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా, పదేళ్ల క్రితమే ఆయిల్‌ఫెడ్‌ను మూసేశారన్నారు. జిల్లాలో ఎరువుల వ్యాపారులు రైతులను దోపిడీ చేస్తున్నా కలెక్టర్, అధికారులకు కన్పించడం లేదా అని ప్రశ్నించారు.

వారిపై పీడీ యాక్ట్ పెట్టరా?

ఇసుక, మద్యం, బూడిద అమ్మకాల దోపిడీలో తేడాలు వచ్చి ఎమ్మెల్యేలు గొడవలకు దిగుతున్న దౌర్భాగ్య స్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. వారిపై పీడీ యాక్ట్ పెట్టేలా సీఎం చర్యలు తీసుకోలేరా? అని ప్రశ్నించారు. రాయలసీమ థర్మల్ పవర్‌లో ఫ్లైయాష్‌ను ప్రభుత్వమే విక్రయించి ఆదాయం పెంచుకోవచ్చని సూచించారు. ఇప్పటికైనా మేలుకోకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

ఆధునిక యుగ పురుషుడు పూలే



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కేశవ్, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు, తదితరులు

- ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం సిటీ: ఆధునిక భారతీయ సమాజాన్ని సంస్కరించడానికి, కుల నిర్మూలన కోసం మొట్టమొదట కృషి చేసిన యుగ పురుషుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి పూలే వర్ధంతి కార్యక్రమానికి మంత్రి కేశవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, శింగనమల, అనంతపురం, రాయదుర్గం ఎమ్మెల్యేలు బండారు శ్రావణిశ్రీ, దగ్గుబాటి ప్రసాద్, కాలవ శ్రీనివాసులు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, నగరపాలక సంస్థ మేయర్ మహమ్మద్ వసీం సలీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, డీఆర్‌ఓ మలోల పాల్గొన్నారు. ముందుగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విలేకర్లతో మంత్రి మాట్లాడుతూ సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి మహాత్మా జ్యోతిబాపూలే సమాజంలో మార్పునకు శ్రీకారం చుట్టి మహనీయుడిగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని, ఆశయ సాధన కోసం ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, శ్రావణి శ్రీ, దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో అంతరాలు తొలగించేందుకు తొలిసారి ప్రయత్నం చేసిన గొప్ప వ్యక్తి పూలే అని కొనియాడారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

- సాగు, తాగునీరు, పరిశ్రమలకు ప్రాధాన్యత
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్, ఆర్థిక శాఖ మంత్రి కేశవ్



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్, చిత్రంలో ఆర్థిక శాఖ మంత్రి కేశవ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్,ఎస్పీ



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు సురేంద్రబాబు, దగ్గుపాటి ప్రసాద్, బండారు శ్రావణి శ్రీ

అనంతపురం అర్బన్: జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు వెళుతున్నామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సాగు, తాగునీరుతో పాటు పరిశ్రమల స్థాపనను ప్రాధాన్యతాంశంగా నిర్దేశించుకున్నామన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో మంత్రి కేశవ్ అధ్యక్షతన జరిగిన డీఆర్‌సీ సమావేశంలో మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, కమిటీ ఉపాధ్యక్షురాలు, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, ఎస్పీ పి.జగదీష్ పాల్గొనగా.. రాప్తాడు, తాడిపత్రి ఎమ్మెల్యేలు పరిటాల సునీత, జేసీ అస్మిత్‌రెడ్డి గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ తగినంత భూమి అందుబాటులో ఉండటంతో జిల్లా పరిశ్రమల హబ్‌గా మారనుందన్నారు. లాజిస్టిక్ హబ్ త్వరలో ఏర్పాటు కానుందన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రజాప్రతినిధులు ఇచ్చే లేఖలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజలకు ప్రయోజనం చేకూర్చే దిశగా పనిచేయాలన్నారు. క్రమశిక్షణ చర్యలు తీసుకునే పరిస్థితి తెచ్చుకోవద్దన్నారు. మంత్రి కేశవ్ మాట్లాడుతూ ప్రాజెక్టులు ఏ దశలో ఉన్నాయి, వాటికి ఎంత మేర భూమి సేకరించాలి అనే దానిపై కచ్చితమైన నివేదికలు అందించాలని చెప్పారు. అనంతరం తమ నియోజకవర్గాల పరిధిలోని సమస్యలను ఎమ్మెల్యేలు సమావేశం దృష్టికి తెచ్చారు.

రైతులను ఆదుకోవాలి

జిల్లాలో కేవలం ఏడు మండలాలనే కరువు ప్రాంతాలుగా ప్రకటించడం సరికాదని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి అన్నారు. పునఃపరిశీలన చేసి కరువు మండలాలను పెంచాలన్నారు. సుబ్బరాయసాగర్‌లో నాలుగు టీఎంసీల నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సభలు నిర్వహించి ఉపాధి పథకం పనులకు అనుమతులివ్వాలన్నారు. ఉరవకొండ ప్రాంతంలో మిరప పంట అధికంగా సాగు చేస్తున్నారని, నల్లి బెడదతో పంట పూర్తిగా దెబ్బతింటున్న నేపథ్యంలో రైతులను ఆదుకోవాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవలు సరిగా అందడం లేదన్నారు. 104, 108 వాహనాలు సమయానికి రావడం లేదని, చాలా వరకు తిరగడం లేదని చెప్పారు. దీంతో అత్యవసర రోగులకు చికిత్స అందని పరిస్థితి నెలకొందన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన వైద్య సేవలు సత్వరం అందేలా చూడాలన్నారు. కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ గ్రామస్థాయి అధికారులు కూడా బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ వార్షిక పరీక్షలకు సంబంధించి ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించేందుకు డిసెంబరు 15 వరకు గడువు పొడిగించారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు క్రితిక శుక్లా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఇంటర్ (జనరల్, ఒకేషనల్) ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు, ప్రైవేట్ (ఫెయిలైన) విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ బోర్డు ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్ తెలిపారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకుని విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. ఇదే చివరి అవకాశమని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

నీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలి

• కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి



కేవీకేను సందర్శించిన సెంట్రల్ టీం

బుక్కరాయసముద్రం: నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డెరెక్టర్ ఆఫ్ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ అరులానందన్ పేర్కొన్నారు. గురువారం రెడ్డిపల్లి కేవీకేను జలశక్తి అభియాన్ జిల్లా వాటర్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ సెంట్రల్ టీం సందర్శించింది. జిల్లాలో నీటి వనరుల వివరాలను బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అరులానందన్ మాట్లాడుతూ... ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా కాపాడుకోవాలని రైతులకు సూచించారు. ఉపాధి హామీ పథకం కింద చెక్‌డ్యాం, ఫారం ఫండ్‌లలో పూడిక తీతలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, శాస్త్రవేత్తలు డాక్టర్ టి.మాధవి, సుధారాణి, కిషోర్, డాక్టర్ కె.మాధవి, డాక్టర్ శశికళ, డీఎల్‌డీఓ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు అనూరాధ, శైలజా, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బిల్ కలెక్టర్ అవినీతిపై కలెక్టర్‌కు లేఖ

గుత్తి రూరల్: స్థానిక మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్ అవినీతిపై కలెక్టర్‌కు విశ్రాంత తహసీల్దార్ అనిల్‌కుమార్ రాసిన లేఖ విచారణ నిమిత్తం గురువారం గుత్తి తహసీల్దార్ కార్యాలయానికి చేరింది. లేఖలోని సారాంశం ఇలా... '2019 నుంచి ఐదేళ్లుగా గుత్తి మున్సిపాలిటీలో బిల్‌కలెక్టర్‌గా పనిచేసిన చంద్రశేఖర్ ఇటీవల గుంతకల్లు మున్సిపాలిటీకి బదిలీ అయ్యాడు. ఆయన ఎక్కడ పనిచేసినా సెలవు పెట్టి పైరవీలతో తిరిగి గుత్తి మున్సిపాలిటీకే బదిలీ చేయించుకుని వస్తాడు. అయితే ఆయన పనిచేసే చోట ఎక్కడ ప్రభుత్వ స్థలాలు ఉన్నా... వాటిని వెంటనే బంధువులు, కుమారుల పేరుపై దొంగ పట్టాలు సృష్టించి ఆక్రమిస్తాడు. ఇలాగే గుత్తి పట్టణంలోని బీసీ కాలనీ సర్వే నంబర్ 411లో దొంగ పట్టాలు సృష్టించి ఆక్రమించుకున్న స్థలంలో నాలుగు భవంతులు నిర్మించాడు'. కాగా, ప్రస్తుతం గుత్తి తహసీల్దార్‌గా ఉన్న ఓబులేసు.... పేరుకే తహసీల్దార్ అని, అయితే ఎలాంటి అవినీతి, అక్రమాలు జరిగినా ఆయన స్పందించడం లేదని లేఖలో పేర్కొనడం గమనార్హం. గుత్తి మున్సిపాలిటీతో పాటు రెవెన్యూ కార్యాలయంలో అవినీతిపై విశ్రాంత తహసీల్దార్ రాసిన లేఖ ప్రస్తుతం గుత్తిలో కలకలం రేపుతోంది.

నిర్లక్ష్యం ఖరీదు రూ.23 లక్షలు!

• విద్యాశాఖ అధికారుల అలసత్వం బట్టబయలు
• 2023 నవంబర్‌లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు 'సీస్' పరీక్ష
• 2024 మార్చి 12న నిర్వహణ నిధులు విడుదల
• రాష్ట్ర వ్యాప్తంగా 25 జిల్లాల్లో నిధుల సద్వినియోగం
• నిర్లక్ష్యం కారణంగా అనంతపురం జిల్లాలో వెనక్కు మళ్లిన నిధులు



అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిచిన ఉదంతం వెలుగు చూసింది. కేవలం అధికారుల అలసత్వం కారణంగా రూ.23 లక్షల నిధులు వెనక్కుపోయాయి. ఇప్పుడానిధుల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

విద్యాప్రమాణాల స్థాయిని గుర్తించేందుకు

ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 3, 6, 9 తరగుతల విద్యార్థులకు 2023 నవంబరులో 'స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే' (సీస్) పరీక్ష నిర్వహించారు. తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో విద్యాప్రమాణాల స్థాయిని గుర్తించేందుకు ఈ సర్వే దోహదపడుతుంది. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలో 1,234 స్కూళ్లలో ఈ పరీక్ష నిర్వహించారు. 3, 6, 9 తరగతులకు చెందిన దాదాపు 32 వేల మంది విద్యార్థులతో జిల్లా సాధారణ పరీక్ష మండలి (డీసీఈబీ) ఆధ్వర్యంలో పరీక్ష రాయించారు. ప్రశ్నపత్రాల రవాణాతో పాటు విధుల్లో పాల్గొన్న ఎంఈఓలు, సీఆర్పీలకు రెమ్యూనరేషన్ చెల్లింపులకు ఎస్‌సీఈఆర్టీ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుంది. దీంతో మండలాల్లో నిర్వహణ బాధ్యతలను మొత్తం ఎంఈఓలే చూసుకున్నారు. ఇందుకోసం ముందస్తుగా వారు సొంతంగా ఖర్చు చేసి తర్వాత బిల్లులు పెట్టారు.

రూ. 23 లక్షల నిధుల మంజూరు

'సీస్' పరీక్ష నిర్వహణకు సంబంధించి ఈ ఏడాది మార్చి రెండోవారంలో ఎస్‌సీఈఆర్టీ నుంచి నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్రశిక్ష కార్యాలయాలకు మంజూరు చేసి అక్కడి నుంచి డీసీఈబీ ఖాతాలకు డ్రా చేసుకోవాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. అప్పటికే సిద్ధంగా ఉన్న బిల్లులను రాష్ట్ర వ్యాప్తంగా 25 జిల్లాల అధికారులు సబ్‌మిట్ చేసి నిధులు డ్రా చేసి, సద్వినియోగం చేసుకున్నారు. ఒక్క 'అనంత' జిల్లాలో మాత్రం అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా సకాలంలో నిధులు డ్రా చేయకపోవడంతో అవి కాస్త వెనక్కు మళ్లాయి.

డీసీఈబీ నిధులు వాడుకుని...

'సీస్' పరీక్ష నిర్వహణకు డిగ్రీ విద్యార్థులను ఇన్విజిలేటర్లుగా నియమించారు. వీరికి మాత్రం రెమ్యూనరేషన్ చెల్లించేలా డీఈసీబీ ఖాతాలో నుంచి దాదాపు రూ.8 లక్షల నిధులు వాడుకునేలా కలెక్టర్ అనుమతులిచ్చారు. అయితే బిల్లులు మంజూరు కాగానే ఆ రూ.8 లక్షలు డీసీఈబీ ఖాతాలో జమ చేయాల్సి ఉంది. ఇక ఎంఈఓలు, సీఆర్పీల రెమ్యూనరేషన్‌తో పాటు ప్రశ్నపత్రాల తరలింపు, ప్యాకింగ్ ఇతర ఖర్చులు మొత్తం కలిపి దాదాపు రూ.15 లక్షలను అధికారులు, ఎంఈఓలే భరించారు. తొమ్మిది నెలలుగా ఎదురు చూస్తున్నా... ఖర్చు పెట్టిన డబ్బు వెనక్కు రాలేదు. దీనికి తోడు నిధులు వెనక్కు పోవడంతో డీఈసీబీ ఖజానాలో రూ.8 లక్షల లోటు అలాగే ఉండిపోయింది.

సంతకం పెట్టని వరలక్ష్మి

సమగ్రశిక్ష ఖాతాల్లో డబ్బులు జమకాగానే వెంటనే డీఈసీబీ కార్యదర్శికి సమాచారం అందించారు. ఆయన వెళ్లి సమగ్రశిక్ష అధికారులతో మాట్లాడి ఫైలు సిద్ధం చేయించి ఆమోదం కోసం అప్పటి డీపీసీ (డీఈఓ) వద్దకు పంపారు. అయితే అప్పటి డీఈఓ వరలక్ష్మి అనుమానాలు వ్యక్తం చేస్తూ 'చూద్దాం..ఆగండి' అంటూ ఆ ఫైల్‌ను పక్కన పెట్టేశారు. కొద్దిరోజుల తర్వాత 'సీస్' పరీక్ష నిర్వహణ కమిటీ సభ్యులందరి సంతకాలు ఉండాలని చెప్పడంతో ఆ మేరకు అందరూ సంతకాలు పెట్టి ఇచ్చారు. అయినా డీఈఓ సంతకం చేయకుండా కొర్రీ వేస్తూ వచ్చారు. చివరకు ఈ ఏడాది మార్చి 31న రాత్రి ఆ నిధులను ఎస్‌సీఈఆర్టీ అధికారులు వెనక్కు తీసుకున్నారు. ఆ తర్వాత రాష్ట్ర అధికారులతో మాట్లాడి ఆ నిధులు తిరిగి తెప్పించే ప్రయత్నాన్ని విద్యాశాఖ అధికారులు అటకెక్కించారు.

నాకేమీ తెలీదు.. కొత్తగా వచ్చా



నేను కొత్తగా వచ్చాను. 'సీస్' పరీక్ష నిర్వహణ నిధులు వెనక్కు మళ్లిన సంగతి నాకు తెలీదు. డీసీఈబీ కార్యదర్శితో మాట్లాడుతా. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు తెప్పించే ప్రయత్నం చేస్తా. – ప్రసాద్‌బాబు, డీఈఓ

రెసిడెన్షియల్ శిక్షణలో ఇంకెందరిని బలి చేస్తారు?



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్

అనంతపురం ఎడ్యుకేషన్: రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ వద్దని మొత్తుకుంటున్నా కూటమి సర్కార్ పట్టించుకోవడం లేదని, ఈ శిక్షణ పేరుతో ఇంకా ఎంతమంది టీచర్లను బలికొంటారంటూ ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు ప్రశ్నించారు. గురువారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఎస్జీటీల రెసిడెన్షియల్ శిక్షణ వల్ల చాలామంది ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వయసు రీత్యా కొందరు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న మరికొందరు ఉపాధ్యాయులు, ముఖ్యంగా మహిళలు వందలాది కిలోమీటర్లు ప్రయాణించి శిక్షణకు రావడం, సుదీర్ఘంగా 10 నుంచి 12 గంటల పాటు శిక్షణలో కూర్చోవడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ ఒత్తిడి తాళలేక ఇటీవల ఓ ప్రధానోపాధ్యాయుడు మరణించాడని, తాజాగా విజయనగరం జిల్లాలో మరో ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందాడం బాధాకరమన్నారు. ఈ ఉపాధ్యాయుల మరణానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే శిక్షణ కార్యక్రమాలను మూకుమ్మడిగా బహిష్కరిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు సర్దార్‌వలి, వెంకటరమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ వన్నప్ప, జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, హిమగిరి ప్రసాద్, తిప్పేస్వామి, రామమూర్తి, సుహేల్, బాబ్జాన్, కలీముల్లా పాల్గొన్నారు.

పూలే ఆశయాలకు 'కూటమి' తూట్లు


పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అనంత వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ తదితరులు

• వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం కార్పొరేషన్: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలకు తూట్లు పొడుస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ప్రజలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వ విద్యను దూరం చేస్తున్నారని మండిపడ్డారు. మహాత్మా జ్యోతిరావ్ పూలే వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆ మహనీయుని చిత్రపటానికి పార్టీ శ్రేణులతో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యతోనే సమ సమాజ స్థాపన ఏర్పాటవుతుందని నమ్మిన జ్యోతిరావు పూలే ఆశయాల మేరకు అన్ని వర్గాల వారికి నాణ్యమైన విద్యనందించేలా అప్పటి ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయని గుర్తు చేశారు. పూలే ఆశయాలకు అనుగుణంగానే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు అమలు చేశారన్నారు. కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చడమే కాక... అదే స్థాయిలో నాణ్యమైన విద్యనూ చేరువ చేశారన్నారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యార్థుల ప్రయోజనాలను కాలరాస్తోందన్నారు. గతేడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన తదితరాలకు సంబంధించి రూ.2,200 కోట్లు విడుదల చేసే సమయంలో కూటమి పార్టీలు కోర్టు కెళ్లి అడ్డుకున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు కావస్తున్నా నేటికీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదన్నారు. ఉద్యోగావకాశాలు, నిరుద్యోగ భృతి తదితర హామీలను సీఎం చంద్రబాబు విస్మరించారన్నారు. వ్యవస్థల వినాశనానికి కారణమైన కూటమి సర్కార్‌కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, టాస్క్‌ఫోర్స్ ప్రతినిధి రమేష్‌గౌడ్, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, సైఫుల్లాబేగ్, ఎగ్గుల శ్రీనివాసులు, శ్రీదేవి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, కార్పొరేటర్లు ఇషాక్, కమల్‌భూషణ్, శ్రీనివాసులు, నరసింహులు, అబూసలేహా, నాయకులు మీసాల రంగన్న, అశ్వత్థనాయక్, పామిడి వీరా, పెన్నోబులేసు, చామలూరు రాజగోపాల్, రాధాకృష్ణ, అమర్‌నాథ్‌రెడ్డి, రియాజ్, నరసింహగౌడ్, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, జావేద్, థామస్, రాధాకృష్ణ, రామచంద్ర, రామయ్య, తానీషా, హరిత, భారతి, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ సెల్ఫీ


అనిల్ (ఫైల్)

బెళుగుప్ప: కుటుంబ కలహాల నేపథ్యంలో విసుగు చెంది తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఓ యువకుడు సెల్ఫీ వీడియో ద్వారా తెలిపి పురుగుల మందు తాగిన ఘటన కలకలం రేపింది. వివరాలు.. బెళుగుప్ప మండలం దుద్దేకుంట గ్రామానికి ఎర్రిస్వామి రెండో కుమారుడు అనిల్ (25)కు ఏడాది క్రితం విడపనకల్లు మండలం హావళిగి గ్రామానికి చెందిన గీతాంజలితో వివాహమైంది. ఈ క్రమంలో కుటుంబంలో కలహాలు చోటు చేసుకోవడంతో విసుగు చెందిన అనిల్ బుధవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశాడు. జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపి పురుగుల మందు తాగాడు. తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని సోదరుడు రామును వీడియోలో కోరాడు. అనంతరం సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. దీంతో అనిల్ కుటుంబీకులు విషయాన్ని బెళుగుప్ప ఎస్‌ఐ శివ దృష్టికి తీసుకెళ్లడంతో పోలీసుల విస్తృత గాలింపు చేపట్టారు.

బధిరుల క్రికెట్ టోర్నీ విజేత ఒడిశా


విజేతగా నిలిచిన ఒడిశా జట్టు

అనంతపురం: బధిరుల అండర్–19 జాతీయ క్రికెట్ చాంపియన్‌షిప్ (ఐడీసీఏ)ను ఒడిశా జట్టు కైవసం చేసుకుంది. అనంత క్రీడాగ్రామం వేదికగా ఆర్డీటీ స్టేడియంలో గురువారం డెఫ్ ఒడిశా, డెఫ్ హర్యానా మధ్య ఫైనల్ పోటీ హోరాహోరీగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన డెఫ్ ఒడిశా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. జట్టులో సనితొట్టి 42 పరుగులతో రాణించాడు. అనంతరం బరిలో దిగిన డెఫ్ హర్యానా జట్టు 17.4 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. 40 పరుగుల తేడాతో ఒడిశా జట్టు గెలుపొందింది. సిరీస్ బెస్ట్ బ్యాటర్‌గా ఆర్వేటి లోకేష్ 126 పరుగులు, బెస్ట్‌బౌలర్‌గా పి. విజయ భాస్కర్ (ఏపీ – 12 వికెట్లు), మ్యాన్ ఆఫ్ ది సిరీస్ సనితొట్టి (ఒడిశా – 116 పరుగులు, 8 వికెట్లు, రెండు క్యాచ్‌లు) నిలిచారు. విజేతలను అభినందిస్తూ ట్రోఫీలను ఐడీసీఏ సెక్రెటరీ అజయ్, స్పోర్ట్స్ అకాడమీ మేనేజర్ శ్రీదేవి, డెఫ్ క్రికెట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కె.గోపీనాథ్, సత్యనారాయణరెడ్డి, తదితరులు అందించారు.

బాల్య వివాహం... ఆరుగురిపై కేసు నమోదు

యాడికి: మైనర్ బాలికకు వివాహం చేసిన ఘటనలో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఈరన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి తెలిపిన మేరకు... తాడిపత్రి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక (14)కు యాడికికి చెందిన ఓ యువకుడి(21)తో ఇరువైపులా కుటుంబసభ్యులు 2022, ఏప్రిల్ 21న కమలపాడు పంచాయతీ పరిధిలోని కొత్త వెంకటరమణ స్వామి ఆలయంలో పెళ్లి జరిపించారు. రెండేళ్లు తిరక్కుండానే ఇద్దరూ విడిపోయారు. ఈ క్రమంలో తన చెల్లెలు జీవితాన్ని చక్కదిద్దాలంటూ బాలిక సోదరుడు గుత్తి కోర్టును ఆశ్రయించాడు. విషయం తెలుసుకున్న న్యాయమూర్తి... పోలీసులు, ఐసీడీఎస్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు సీఐ ఈరన్న విచారణ చేపట్టి పెళ్లి చేసుకున్న యువకుడితో పాటు ఆయన తల్లిదండ్రులు, బాలిక తల్లిదండ్రులు, సోదరుడిపై కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన వివాహిత ఎరికల రాధ (23) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా పెద్దకడుబూరుకు చెందిన సిద్ధమ్మ కుమార్తె రాధకు నాలుగేళ్ల క్రితం ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన ఎరికల శరణప్పతో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు , కుమార్తె ఉన్నారు. గురువారం పుట్టింటికి వెళతానంటూ రాధ అనడంతో భర్త వారించాడు. ప్రతిసారీ పుట్టింటికి వెళతాననడం మంచిది కాదనడంతో క్షణికావేశానికి లోనై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా, తమ కుమార్తెను భర్త, ఆడపడచు, అత్త తరచూ కొట్టేవారని, వారి వేధింపులు తాళలేక ఆమె ఆత్మహత్య చేసుకుందంటూ మృతురాలి తల్లి సిద్ధమ్మ, బంధువులు ఆరోపించారు. సిద్ధమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇంకుడు గుంత పరిశీలన


వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

గార్లదిన్నె: ఉపాధి హామీ పథకంలో భాగంగా గార్లదిన్నె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన వాటర్ హార్వెస్టింగ్ (ఇంకుడు గుంత) స్ట్రక్చర్‌ను కేంద్ర బృందం సభ్యులు అరులానందన్, షరీఫ్‌ఖాన్ గురువారం పరిశీలించారు. రూ.60 వేలు ఉపాధి హామీ పథకం నిధులతో ఇంకుడు గుంతను నిర్మించినట్లు ఈ సందర్భంగా వారికి ఏపీడీలు శైలజ, విజయకుమార్, సుధాకర్‌రెడ్డి వివరించారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఏపీఓ నాంచారమ్మ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో బోధనేతర ఉద్యోగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన కలకలం రేపింది. వివరాలు... ఎస్కేయూ పరీక్షల విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.లక్ష్మీనారాయణ 2016–17లో తండ్రి నారాయణ మరణానంతరం కారుణ్య నియామకం కింద విధుల్లో చేరారు. బోధనేతర ఉద్యోగ సంఘం కార్యదర్శి పదవిలోనూ ఆయన కొనసాగుతున్నారు. ఈ క్రమంలో తనతో పాటు తనలాంటి వారికి పదోన్నతి కల్పించాలంటూ సంఘం తరఫున పలు మార్లు వర్సిటీ ఉన్నతాధికారులకు విన్నవించారు. అయినా ఫలితం దక్కలేదు. ఇటీవల జరిగిన పాలకమండలి సమావేశంలోనూ పదోన్నతుల అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో గురువారం సాయంత్రం ఎస్కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లోకి దూసుకెళ్లి రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు ఎదుటనే పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేశాడు. అప్రమత్తమైన అక్కడున్న ఉద్యోగులు వెంటనే అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న ఇటుకలపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని లక్ష్మీనారాయణను అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఎస్సీ కేటగిరిలో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులో తనకు పదోన్నతి కల్పించాలంటూ వేడుకున్నా అధికారులు స్పందించడ లేదంటూ లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశాడు. రిజిస్ట్రార్ ఒంటెత్తు పోకడలతో విసుగు చెంది చివరకు చనిపోవాలని నిర్ణయించుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసుల ఎదుట అంగీకరించాడు. ఎస్సీల పట్ల ఎస్కేయూ రిజిస్ట్రార్ వైఖరి మారాలని ఎస్సీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

విషజ్వరంతో విద్యార్థి మృతి


చరణ్ (ఫైల్)

రాయదుర్గం టౌన్: విషజ్వరం బారిన పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. వివరాలు.. కూలి పనులతో జీవనం సాగిస్తున్న రాయదుర్గం మండలం చదం గ్రామానికి చెందిన దేవేంద్రప్ప, గోవిందమ్మ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న చిన్నకుమారుడు చరణ్ (12) కొన్ని రోజుల క్రితం జ్వరం బారిన పడ్డాడు. చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో పది రోజుల క్రితం బళ్లారిలోని విమ్స్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు వెంటనే ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని చికిత్స మొదలు పెట్టారు. రెండు రోజుల క్రితం రోగిలో జాండీస్ లక్షణాలు బయటపడ్డాయి. పరిస్థితి విషమిస్తుండడంతో బెంగళూరుకు రెఫర్ చేశారు. అయితే ఈ పదిరోజుల్లో కుమారుడి వైద్యం కోసం దాదాపు రూ.20 వేలకు పైగా ఖర్చు పెట్టిన నిరుపేద తల్లిదండ్రులు బెంగళూరుకు వెళ్లేందుకు డబ్బు సర్దుబాటు చేసుకునే క్రమంలో విమ్స్ నుంచి కుమారుడిని పిలుచుకుని వచ్చారు. రెండు రోజులుగా ఎంత ప్రయత్నించినా డబ్బు సర్దుబాటు కాలేదు. ఈ క్రమంలో ఆరోగ్యం విషమించి గురువారం సాయంత్రం చరణ్ మృతి చెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల ఆవేదనకు అంతులేకుండా పోయింది.

క్లుప్తంగా

గోకులం షెడ్లలో నాణ్యత లోపిస్తే చర్యలు



గోకులం షెడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి

రాప్తాడు: పాడి పశువులకు కోసం నిర్మించే గోకులం షెడ్లలో నాణ్యత లోపించకుండా అధికారులు సూచించిన విధంగా నాణ్యతగా నిర్మించాలని ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామంలో రైతులు నిర్మించుకుంటున్న గోకులం షెడ్లు, ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గోకులం షెడ్లు అన్ని పురోగతిలో ఉన్నాయని తెలిపారు. బోరు బావుల్లో నీటి మట్టం పెరగాలంటే ప్రతి రైతు తమ పొలాల్లో ఇంకుడు గుంతలు తవ్వుకోవాలన్నారు. ఇంకుడు గుంతలతో బోరు బావుల్లో నీరు సమృద్ధిగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సావిత్రి, ఈసీ మురళి కృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ నరసింహా రెడ్డి

ఆత్మకూరు: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ నరసింహా రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని తోపుదుర్తి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులు, పిల్లల హాజరు పట్టికను పరిశీలించారు. పిల్లల హాజరు శాతం తగ్గరాదని తెలిపారు. పాఠశాలలకు రాని పిల్లల్ని గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు. పిల్లలు పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని తాజా కూరగాయలు వాడాలని తెలిపారు.

పాఠశాలలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి శివకృష్ణ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 200 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, విద్యార్థుల డేటాను సేకరించారు. ఈ డేటాను అపార్‌కు అనుసంధానం చేస్తామని వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో ముందంజలో ఉంటారని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తమ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాలు వస్తున్నాయని సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు లీలావతి, అనిత, చంద్రకళ, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి రూ.7 వేల కోట్లు ఇవ్వాలి



ఇన్‌చార్జ్ మంత్రి టి.జి.భరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధికి రూ.7 వేల కోట్లు నిధులను ప్రభుత్వం కేటాయించేలా చూడాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి టి.జి.భరత్‌కు సీపీఎం నాయకులు విన్నవించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డీఆర్‌సీ సమావేశానికి హాజరైన మంత్రిని సీపీఎం నాయకులు నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్ర కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, రామాంజనేయులు కలిశారు. నిధులు మంజూరు చేసి తుంగభద్ర ఎగువకాలువ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలన్నారు. హంద్రీ–నీవా కాలువ పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని కోరారు. జిల్లాలో ఇనుము, ఉక్కు కార్మాగారాన్ని నిర్మించాలన్నారు. అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా ఇవ్వాలన్నారు. 2023 ఖరీఫ్, రబీ పంటల బీమా ప్రకటించాలన్నారు. పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

మాలధారణం.. నియమాల తోరణం

- నియమనిష్టలతో కొనసాగుతున్న అయ్యప్ప దీక్షలు
- మార్మోగుతున్న శరణు ఘోష



చెరువుకట్ట అయ్యప్ప స్వామి ఆలయం వద్ద భిక్ష చేస్తున్న అయ్యప్ప మాలధారులు

అనంతపురం కల్చరల్: హరిహరసుతుడి శరణు ఘోషతో నగరం మార్మోగుతోంది. వేల సంఖ్యలో మాలధారులు నియమనిష్టలతో దీక్షను కొనసాగిస్తున్నారు. మండల పూజలు ఈనెల 16న ప్రారంభమై డిసెంబర్ 26 వరకూ కొనసాగుతాయి. తర్వాత జనవరి రెండవ వారంలో జ్యోతి దర్శనం వరకూ మాలధారులు సన్నిధానానికి వెళ్తుంటారు. మండల దీక్షలు చేస్తున్న వారు, జ్యోతి దర్శనానికి వెళ్లే అయ్యప్పలే కాకుండా ఇతర మాలలు ధరించిన స్వాములూ భక్తిశ్రద్ధలతో దీక్షలను కొనసాగిస్తున్నారు. తెల్లవారుజాము నుంచే వివిధ ఆలయాలకు వెళ్లే మాలధారులతో ఆలయ పరిసరాల్లో భక్తి భావం ఉట్టిపడుతోంది. హెచ్చెల్సీ కెనాల్ వద్ద సామూహిక స్నానాలను ఆచరించడం, సాయంత్రం భజనలు, ఐక్యతను, సేవాభావాన్ని చాటుతూ భిక్ష తీసుకుంటున్నారు. మాలధారులకు నిత్యం భిక్ష వసతి కల్పిస్తూ ఆలయాల నిర్వాహకులు కూడా ఆధ్యాత్మిక సేవలో తరిస్తున్నారు. ఒకప్పుడు మాలధారణ చేసే స్వాములు భిక్ష కోసం అనేక ఇబ్బందులు పడేవారు. గతంలో జిల్లా అంతటికి చెరువుకట్టపై వెలసిన అయ్యప్ప దేవాలయం మాత్రమే ఉండేది. ప్రస్తుతం చాలా అయ్యప్ప దేవాలయాలు మాలధారులకు భిక్ష వసతి కల్పిస్తున్నాయి.

పలుచోట్ల ఉచిత భిక్ష..

మండల దీక్షలు పాటిస్తున్న అయ్యప్ప స్వామి మాలధారులకే కాకుండా భవానీ, గోవింద, ఆంజనేయ స్వామి మాల ధరించిన స్వాములకు నగరంలోని పలు ఆలయాలు ఏటా భోజన వసతి కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే చెరువుకట్టపై వెలసిన అయ్యప్పస్వామి ఆలయంతో పాటూ నగరంలోని మొదటి రోడ్డు హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం, హెచ్చెల్సీ కాలనీలోని ధర్మశాస్త అయ్యప్ప దేవాలయం, రామనగర్ 80 అడుగుల రోడ్డు వద్ద ఉన్న అయ్యప్ప ఆలయం, ఎస్కేయూ సమీపంలోని కై లాసనాథ ఆలయ ప్రాంగణం తదితర చోట్ల అన్నదాన సేవలు జరుగుతాయి. స్థానిక అశోక్ నగర్‌లోని హరిహర దేవాలయంలో సాయిట్రస్టు వారు డిసెంబరు 3 నుంచి 40 రోజుల పాటూ మాలధారులకు భోజన వసతి కల్పిస్తున్నట్లు ట్రస్టు ప్రతినిధి విజయ్ కుమార్ తెలిపారు. వీటితో పాటూ చెరువుకట్టపై ఉండే వెంకయ్య స్వామి ఆలయం, వేమన టెలిఫోన్ భవనం ఎదురుగా ఉన్న బాబా మందిరంలో నిత్యాన్నదానం జరుగుతుంది.

డిసెంబర్ ఆఖరు వరకూ భిక్ష



నేను 22 ఏళ్లగా అయ్యప్ప మాల వేస్తున్నా. ప్రశాంతత కోసం నియమబద్ధ జీవితం ఆస్వాదించడానికి నగరంలో 10 వేల మందికి పైగా మాలధారణ చేస్తున్నారు. అయ్యప్పలు ఇబ్బందులు పడకుండా మధ్యాహ్నం, రాత్రి పూట కూడా 1,000 మందికి భోజన వసతి కల్పిస్తున్నాం. డిసెంబర్ ఆఖరు వరకూ మాలధారులకు భిక్ష ఏర్పాటు చేస్తాం. దీనికి తోడు ఈసారి ఆలయంలో డిసెంబర్ 5 నుంచి 10 వరకూ శబరిమల సన్నిధానం నుంచి బ్రహ్మశ్రీ రాజీవ్ తంత్రి శిష్యబృందాల చేతుల మీదుగా ఉత్సవ వేడుకలు జరుగుతాయి. అందరూ స్వామి ప్రసాదాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– మణికంఠ గౌతం, చెరువుకట్ట అయ్యప్ప స్వామి ఆలయ అధ్యక్షుడు

రైల్వే ఎస్ఐ విజయ కుమార్ బదిలీ



అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే ఎస్ఐ (జీఆర్‌పీ) పి.విజయ కుమార్ బదిలీ అయ్యారు. ఈ మేరకు గుంతకల్లు రైల్వే ఎస్పీ గురువారం ఉత్వర్వులు జారీ చేశారు. శుక్రవారం కర్నూలు డీఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోనున్నారు. ఆ తరువాత ఆయనకు ఏదో ఒక పోలీస్ స్టేషన్‌కు పోస్టింగ్ ఇస్తారు. ఆయన స్థానంలో ధర్మవరం రైల్వే ఎస్ఐగా పని చేస్తున్న కె.వెంకటేశ్వర్లును నియమించారు. ఆయన ఒకటి రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

అనంత కళాకారుల నాట్య వైభవం



అరుణాచలంలో నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

అనంతపురం కల్చరల్: సుప్రసిద్ధ శైవక్షేత్రమైన అరుణాచలంలో అనంత కళాకారులు నాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. పవిత్ర కార్తీకమాసంలో దేశవ్యాప్తంగా శాస్త్రీయ నృత్యకళాకారులకు మహాశివుడి ముందు నాట్య నీరాజనాలర్పించే అవకాశాన్ని ఆలయ ప్రతినిధులు కల్పిస్తున్నారు. ఆ నేపథ్యంలో అనంతకు చెందిన శ్రీనృత్య కళానిలయం నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం శివస్తుతి, శివ తాండవం కళారూపాలను అద్భుతంగా ప్రదర్శించారు. 50 మంది చిన్నారుల శివపార్వతుల వేషధారణలతో సాగిన కళారూపకాలు అమితంగా ఆకట్టుకున్నాయని ఆలయ అధికారులు ప్రశంసించారు. జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో మహాలక్ష్మి మిత్ర బృందం, బ్రాహ్మణ సంఘం ప్రతినిధి శ్రీనిధి రఘు, సామాజిక సేవా కార్యకర్త విజయ్ కుమార్, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే సేవలు ఆదర్శం



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, తదితరులు

అనంతపురం సిటీ: తరతరాలుగా సమాజాన్ని పట్టి పీడిస్తున్న సామాజిక రుగ్మతలను రూపుమాపిన రుషి, మహర్షి మహాత్మా జ్యోతిరావు పూలే అని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని అనంతపురంలోని జెడ్పీ కార్యాలయంలో ఉన్న ఆయన విగ్రహానికి మేయర్ మహమ్మద్ వసీం సలీం, డిప్యూటీ మేయర్ దాసరి వాసంతి సాహిత్య, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజమ్మ మాట్లాడుతూ.. నిమ్న జాతులు, సమాజం వెలివేసిన పిల్లలకు చదువు నేర్పించారన్నారు. అనాథ శిశువులను ఆదరించి, స్త్రీలకు విద్య నేర్పించారని గుర్తు చేశారు. బాల్య వివాహాలు, వితంతువులకు జుట్టు కత్తిరించడం వంటి మూఢాచారాలను ఖండించారని పేర్కొన్నారు. పురోహిత వ్యవస్థ, వర్ణ వ్యవస్థను ప్రతిఘటించిన వీరుడిగా పూలేను అభివర్ణించారు. కుల వ్యవస్థ, సామాజిక అణచివేత, దోపిడీని వ్యతిరేకిస్తూ సేద్యగాని చర్నాకోల, గులాంగిరి వంటి రచనలు చేయడంతో పాటు సత్యశోధక సమాజ్ ద్వారా ఆచరణను కూడా ప్రారంభించారని మేయర్ వసీం అన్నారు. పెత్తందారీ వ్యవస్థపై తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు. భారతదేశంలోని బడుగు, బలహీన వర్గాల వారు కుల వ్యవస్థలో అమెరికాలోని నల్లజాతి బానిసల్లాగే ఉన్నారని పూలే భావించారన్నారు. కుల, మత, వర్గ, వర్ణంతో సంబంధం లేకుండా మానవులందరూ దేవుడి దృష్టిలో సమానమేనని తెలిపారు. అందరికీ సమాన హక్కులు ఉండాలని పోరాడిన యోధుడు పూలే అని డిప్యూటీ మేయర్ దాసరి వాసంతి సాహిత్య కొనియాడారు. త్వరితగతిన సమాజంలో మార్పు రావాలంటే విద్య ద్వారానే సాధ్యమని నమ్మి, ఆ దిశగా తన ప్రయత్నాలు మొదలుపెట్టారని పేర్కొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..

పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నేతలు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి నివాళులర్పించారు.

కృత్రిమ గర్భధారణతో ప్రయోజనాలు



పాడి పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

రాప్తాడు: కృత్రిమ గర్భధారణ ప్రక్రియతో పాడి రైతులకు బోలెడు ప్రయోజనాలున్నాయని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి టి.వి.సుధాకర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని గాండ్లపర్తి గ్రామంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భదారణ, మంచి పశువులను ఎంపిక చేయడానికి ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. లింగ నిర్ధారిత వీర్యం సూదులను ప్రభుత్వమే సరఫరా చేస్తుందని తెలిపారు. ఈ వీర్యం వలన 90 శాతం పెయ్య దూడలే జన్మిస్తాయని పేర్కొన్నారు. విదేశీ జాతుల దూడలే కాక స్వదేశీ జాతులైన గిర్, సాహివాల్, తార్పర్కార్ వంటి జాతుల దూడల బ్రీడ్‌ను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఈ లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. నట్టల నివారణ మందులు వేశారు. సాధారణ పశువులకు కూడా చికిత్సలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీ ప్రకాష్, పశు వైద్య సిబ్బంది, గోపాల మిత్ర, రైతులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న అడ్వకేట్ పరమ గీతారావు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరమని జిల్లా కోర్టు అడ్వకేట్ పరమగీతారావు తెలిపారు. సైబర్ బెదిరింపులపై గురువారం స్థానిక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు, డిజిటల్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల వరకు కూడా ఈ సైబర్ మోసాలు విస్తరించాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కోర్టు అడ్వకేట్ పరమగీతారావు మాట్లాడుతూ.. సోషల్ మీడియా ఉపయోగాలు, ప్రతికూలతలను వివరించారు. వివిధ రకాల సైబర్ బెదిరింపులను ఎదుర్కొనేందుకు న్యాయ సంబంధమైన చట్టాలు ఎలా సహకరిస్తాయో తెలిపారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి అంబటి రేణుకా దేవి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ రంగయ్య, అధ్యాపకులు డాక్టర్ సి.రామాంజనేయులు, మణిదీప్తి, శ్వేతా, ఉష పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు ఇస్తున్న రెసిడెన్షియల్ శిక్షణను తక్షణమే రద్దు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర విద్యాశాఖాధికారుల మొండి వైఖరి, నిరంకుశ ధోరణి మరో నిండు ప్రాణాన్ని బలిగొందని వాపోయారు. విజయనగరం జిల్లాలో జరుగుతున్న లీడర్‌షిప్ రెసిడెన్సియల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఓ హెచ్ఎం గుండెపోటుతో మరణించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు రకాల రెసిడెన్షియల్ ట్రైనింగ్‌లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో జరపాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకుండా అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారన్నారు. ఉపాధ్యాయుల సమ్మతితో జిల్లా కేంద్రాల్లో నాన్ రెసిడెన్షియల్ విధానంలో జరుపుతామని చెప్పి.. పాత పద్ధతిలోనే ట్రైనింగ్ ఇన్నారన్నారు. అధికారులకు ఉపాధ్యాయుల ప్రాణాలంటే లెక్క లేదా? అని ప్రశ్నించారు. ఎంతమంది ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోతే స్పందిస్తారా? అని మండిపడ్డారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



కొండా పక్కీరు పుల్లన్న (ఫైల్)

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొండాపక్కీరు పుల్లన్న (47) గురువారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. రైతు కుటుంబానికి చెందిన పుల్లన్న వైఎస్సార్‌సీపీలో కీలకంగా పని చేశారు. నాలుగు రోజుల క్రితం బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో అనంతపురంలోని సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈయన భార్య కృష్ణమ్మ పంచాయతీ వార్డు మెంబర్‌గా కొనసాగుతున్నారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, సర్పంచ్ ప్రశాంత్‌కుమార్, ఉప సర్పంచ్ కేపీ ఓబులేసు, ఎంపీటీసీ సభ్యురాలు రాగే రేవతి పెద్దప్ప, నరసింహారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, హోతూరు సుధీర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటరాముడు తదితరులు పుల్లన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చురుకైన నాయకుడిని పార్టీ కోల్పోయిందన్నారు. మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలి



విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కోన శశిధర్‌తో మాట్లాడుతున్న మచ్చా రామలింగారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలందరికీ ఉచిత విద్య అందించేలా చూడాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కోన శశిధర్‌కు ఏపీడబ్ల్యూజేయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం అనంతపురంలో కోన శశిధర్‌ను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీడబ్ల్యూజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్‌లోనూ జర్నలిస్టు పిల్లలకు ప్రత్యేక కోటా ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కోరారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ప్రభుత్వ పెద్దలతోనూ చర్చించి వర్కింగ్ జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య అందించే విషయంపై తగిన చర్యలు తీసుకుంటామని కోన శశిధర్ హామీ ఇచ్చారు. గతంలో తాను ఇక్కడ కలెక్టర్‌గా పని చేస్తున్న సమయంలోనూ మచ్చా రామలింగారెడ్డి నాయకత్వంలో అప్పట్లో వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు జిల్లాలో ఉచిత విద్య అమలు చేశామని గుర్తు చేశారు. రాష్ట్రంలో మొట్టమొదటి జర్నలిస్ట్ కాలనీ అనంతపురంలో ఉండటం అభినందనీయమన్నారు. ప్రిన్సిపల్ కార్యదర్శిని కలిసిన వారిలో జర్నలిస్టు యూనియన్ నాయకులు విజయ రాజు, వెంకటేశ్వర్లు, షాకీర్, రఘు, సాయి తదితరులు ఉన్నారు.

అధికార పార్టీ నాయకులకు అడ్డాగా 'ఎస్కేయూ'



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకుడు దివాకర్ నాయక్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాన్ని అధికార పార్టీ నాయకులకు అడ్డాగా మార్చివేశారని ఏబీవీపీ నాయకులు మండిపడ్డారు. గురువారం ఎస్కేయూలో ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు దివాకర్ నాయక్ మాట్లాడుతూ.. వర్సిటీ పాలన అస్తవ్యస్తంగా తయారైందన్నారు. నిబంధనలు తుంగలో తొక్కుతూ కేవలం అధికార పార్టీ నాయకుల సిఫార్సుల ఆధారంగానే జన్మభూమి క్యాంటీన్, మెయిన్ గేట్ వద్ద ఉన్న షాపులను కట్టబెట్టారని విమర్శించారు. టెండర్ నిబంధనలు పాటించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పరీక్షల విభాగంలో పని చేస్తున్న కొంత మంది ఉద్యోగులపై నిత్యం అవినీతి ఆరోపణలు వస్తున్నా.. వారిని బదిలీ చేయకుండా వారి దోపిడీకి పరోక్షంగా సహకరిస్తున్నారన్నారు. సర్టిఫికెట్ ఇవ్వడానికి ఒక విద్యార్థి నుంచి రూ.30 వేలు డిమాండ్ చేసినా.. ఆ ఉద్యోగిపై రిజిస్ట్రార్ ఇప్పటి దాకా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. కేవలం మౌఖికంగా హెచ్చరికలు జారీ చేసి మిన్నకుండిపోయారని తెలిపారు. సర్టిఫికెట్ల కోసం వచ్చిన విద్యార్థినులతో కొంత మంది దురుసుగా ప్రవర్తించినప్పటికీ కనీస చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎస్కేయూ ముట్టడికి పిలుపునిస్తామన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశబూరు. కార్యక్రమంలో రిషికేష్, ఇంద్రసేన, రవి, వంశీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం కరువు.. అభివృద్ధి బరువు



లక్ష్మీనగర్‌లోని నీలం సంజీవ రెడ్డి పార్క్‌లో పెరిగిన పిచ్చి మొక్కలు



జన్మభూమి చిల్డ్రన్స్ పార్క్‌లో కనిపించని పచ్చదనం

- నగరంలో అస్తవ్యస్తంగా పార్క్‌లు
- పట్టించుకోని అధికారులు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ అధికారుల బాధ్యతరాహిత్యంతో పార్క్‌లు అస్తవ్యస్తగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో పార్క్‌లు కనుమరుగవుతున్నాయి. నగర ప్రజల ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన పార్క్‌ల్లో కనీస సౌకర్యాలు మృగ్యంగా మారాయి. నగరంలోని రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్, నీరు ప్రగతి వనం, బుద్ధవిహార్ పార్క్, తదితర పార్క్‌లు మినహా మిగితా పార్క్‌లు అధ్వాన స్థితిలో ఉన్నాయి.

నగరంలో 28 పార్క్‌లు..

నగరంలోని 50 డివిజన్లలోని 74 సచివాలయాల పరిధిలో 28 పార్క్‌లు ఉన్నాయి. కాగా ఈ పార్క్‌ల్లో 15కుపైగా శిథిలావస్థలో, అసౌకర్యాల నడుమ నడుస్తున్నాయి. దీంతో ప్రజలు నగరంలోని కొన్ని పార్క్‌లకు మాత్రమే వెళ్తున్నారు. ఒక వేళ పార్క్‌లు ఉన్నా అందులో వాకింగ్ ట్రాక్, పచ్చదనం అటువంటివి కన్పించని పరిస్థితి. లక్ష్మీనగర్‌లో ఉండాల్సిన నీలం సంజీవరెడ్డి పార్క్ కనుమరుగైంది. పార్క్‌ల గేట్లు పడిపోవడంతో వాటిని పక్కన పెట్టేశారు. వాస్తవంగా ఈ పార్క్ నిర్మాణానికి రూ.22 లక్షలతో ప్రహరీ నిర్మించాల్సి ఉన్నా.. ఇంత వరకు వాటి పనులు ప్రారంభం కాలేదు. అలాగే సాయినగర్‌లో నేతాజీ పార్క్ లోనూ అసౌకర్యాలున్నాయి. శ్రీనగర్ కాలనీలో పార్క్‌లో ప్రహరీ కూలిపోయింది. 32వ డివిజన్ హౌసింగ్ బోర్డులోని అభయాంజనేయ స్వామి పార్క్, హౌసింగ్ బోర్డులోని లక్ష్మీనరసయ్య పార్క్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. అదేవిధంగా 50వ డివిజన్ అరుణోదయ కాలనీలో మహిళా, చిల్డ్రన్స్ పార్క్‌లో అభివృద్ధి పనులు నత్తనడక సాగుతున్నాయి.

రూ.కోట్లలో నిధులు

నగరపాలక సంస్థలో సాధారణ నిధులు రూ.కోట్లతో మూలుగుతున్నాయి. కానీ నగరాభివృద్ధికి ప్రజలు పన్నుల రూపంలో రూ.కోట్లు చెల్లిస్తున్నారు. కానీ ప్రజలకు కల్పించాల్సిన చిన్నపాటి సౌకర్యాలను నగరపాలక సంస్థ అధికారులు విస్మరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



నీరు లీకేజీ అవుతున్న పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండల కేంద్రంలోని సిద్ధరాంపురం గ్రామానికి వెళ్లే రహదారిలో తాగునీరు సరఫరా అయ్యే పైప్‌లైన్లకు లీకేజీ ఏర్పడింది. తాగునీరు వృథా అవుతుండటంతో ఈనెల 24వ తేదీన సాక్షి దినపత్రికలో 'వృథా చేస్తే కన్నీరే' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివ కుమార్, సర్పంచ్ వరలక్ష్మి స్పందించారు. లీకేజీ అవుతున్న పైప్‌లైన్‌లకు రెండు రోజులుగా మరమ్మతులు చేయించారు. నీరు లీకేజీ కాకుండా చర్యలు చేపట్టారు.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

అనంతపురం సెంట్రల్: మత్తు పదార్థాల వాడకంతో ఆరోగ్యం క్షీణించడమే కాకుండా జీవితాలు నాశనం అవుతాయని పోలీసు అధికారులు సూచించారు. గురువారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు చుట్టపక్కల వారికి అవగాహన కల్పించి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చూడాలన్నారు.

జోనల్‌స్థాయి జూడో పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ, పీఈటీ

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల ఉరవకొండలో జరిగిన జోనల్‌స్థాయి (ఏడు స్కూళ్లు) జూడో పోటీల్లో స్థానిక రుద్రంపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వివరాలను పాఠశాల హెచ్ఎం సుమంగళి గురువారం తెలియజేశారు. వివిధ విభాగాల నుంచి 8 మంది విద్యార్థులు సిల్వర్ మెడల్స్, ఏడుగురు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఓవరాల్ చాంపియన్ షిప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ విద్యార్థులను హెచ్ఎంతో పాటు పీడీ ఎం.లావణ్య, పీఈటీ ఎం.అన్నపూర్ణ అభినందించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కనగానపల్లి: బాల్య వివాహాలు చేయటం వల్ల ఆడ పిల్లల భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి తెలిపారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో గురువారం బాల్య వివాహాల నిర్మూలనపై అంగన్‌వాడీ సిబ్బంది విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బాల్య విదాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.